సాక్షి ఖమ్మం

బుధవారం । 29 । జనవరి । 2025



రైటర్లు చెబితే రైట్..రైట్!
సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు డాక్యుమెంట్ రైటర్లు అంతా తామై వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 8లో



రైతులకు చేయూత
రైతులకే కాక వారి సంక్షేమానికి కృషి చేస్తున్న శాఖలు, సంస్థలకు చేయూతనిస్తున్నామని నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 17°

వాతావరణం
జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత కొద్దిమేర పెరుగుతుంది. సాయంత్రం తర్వాత మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

'వనజీవి' దంపతులను సన్మానించిన సీఎం



రామయ్యకు చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన చిరంజీవి తదితరులు

ఖమ్మంరూరల్: ఖమ్మం జిల్లా రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి(దరిపల్లి) రామయ్య – జానకమ్మను సీఎం రేవంత్‌రెడ్డి, సినీనటుడు చిరంజీవి సన్మానించారు. రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో మంగళవారం ప్రత్యేక కార్యక్రమంలో వారిని వేదికపైకి ఆహ్వానించి సన్మానించిన సీఎం మాట్లాడారు. రైతు కుటుంబం నుండి వచ్చి రామయ్య లక్షలాది మొక్కలు నాటి పర్యావరణానికి తోడ్పాటునందిస్తుండడంతో పద్మశ్రీ అవార్డు దక్కిందని తెలిపారు. అనంతరం ఆయనకు చెక్కు అందజేశారు.

వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యాన యువతకు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ అనంతరం సెట్విన్ ద్వారా పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేస్తామని డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు విద్యార్హత, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటో జతపరిచిన దరఖాస్తును జిల్లా యువజన క్రీడా కార్యాలయంలో ఫిబ్రవరి 1లోగా అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 99482 07271 నంబర్‌లో సంప్రదించాలని డీవైఎస్‌ఓ తెలిపారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా పద్మశ్రీ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న డీఆర్‌ఓ


ఖమ్మం సహకారనగర్: జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా ఏ.పద్మశ్రీ నియమితులయ్యారు. కొన్నాళ్లుగా డీఆర్వో పోస్టు ఖాళీగా ఉండడంతో రాజేశ్వరి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈనేపథ్యాన మెదక్ డీఆర్వోగా పనిచేస్తూ సెలవులో ఉన్న పద్మశ్రీని ఖమ్మంకు కేటాయించగా ఆమె మంగళవారం విధుల్లో చేరారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆమె కలవగా, కలెక్టరేట్ ఉద్యోగులు డీఆర్వోకు శుభాకాంక్షలు తెలిపారు.

మైనార్టీ సంక్షేమాధికారిగా పురంధర్



పురంధర్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా డాక్టర్ బోడేపూడి పురంధర్ మంగళవారం విధుల్లో చేరారు. తొలుత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ నుండి బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా పని చేస్తున్న పురంధర్‌ను ప్రభుత్వం డిప్యూటేషన్‌పై ఖమ్మంకు కేటాయించింది.



రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీన ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాల ద్వారా మొదటి విడతలో జిల్లాలోని 6,361 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఇరవై మండలాల్లో 206గామాల్లో అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమాల్లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో 15,856 మంది ఉన్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

15,856 మంది
6,361 కుటుంబాలు

నాలుగు పథకాలతో తొలి విడతగా లబ్ధి
- ఇప్పటికే రైతుభరోసా, ఆత్మీయ భరోసా నగదు జమ
- రేషన్‌కార్డుల మంజూరు, చేతికి ఇళ్ల ప్రొసీడింగ్స్..
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఎంపిక చేసిన గ్రామాల్లో..

నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభానికి అధికారులు జిల్లాలోని 20 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి గణతంత్ర దినోత్సవం రోజున లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. దీంతో మొత్తం 6,361 కుటుంబాలకు సంబంధించి 15,856 మందికి లబ్ధి కలిగింది. ఇందులో 12,649 మంది ఖాతాల్లో రైతుభరోసా, 840 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు జమ అయింది. అలాగే, 959 మంది కొత్తగా తెల్ల రేషన్‌కార్డులు అందుకోగా, 1,408 మందికి ఇందిరమ్మ ఇళ్ల నిధులు జమ కానున్నాయి.

ఆ గ్రామాల్లో అత్యధికం

మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఐదేసి గ్రామాలు, పాలేరు, వైరా నియోజకవర్గాల్లో నాలుగు, ఖమ్మం నియోజకవర్గంలో ఒక గ్రామంతో పాటు ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే కామేపల్లి మండలం పొన్నెకల్‌లో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో అత్యధికంగా ఖమ్మంరూరల్ మండలం ఆరెంపులలో 782 మందికి లబ్ధి జరిగింది. కొణిజర్ల మండలం చినగోపతిలో 695 మందికి, సత్తుపల్లి మండలం కొత్తూరులో 510మందికి పథకాలు అందాయి.

12,649 మందికి రైతుభరోసా

జిల్లాలోని 12,649 మంది అన్నదాతల ఖాతాల్లో రైతుభరోసా నగదు జమ అయింది. ఇందులో అత్యధికంగా రఘునాథపాలెం మండలం మల్లేపల్లిలో 2,532 మందికి నగదు అందింది. ఎర్రుపాలెం మండలం రాజులదేవరపాడులో 2,188 మందికి, వేంసూరు మండలం చిన్నమల్లెలలో 1,165 మందికి రైతుభరోసా జమ అయింది. అతి తక్కువగా కల్లూరు మండలం తూర్పులోకవరం గ్రామంలో 85 మంది ఖాతాల్లో రైతుభరోసా నగదు అయిందని అధికారులు వెల్లడించారు. ఇక సత్తుపల్లి మండలం కల్లూరులో 135 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. కామేపల్లి మండలం పొన్నెకల్‌లో 127 మందికి, ఏన్కూరు మండలం రేపల్లెవాడలో 122మంది దక్కగా.. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో 114 మందికి రేషన్‌కార్డులు అందాయి. అలాగే, ఖమ్మంరూరల్ మండలం ఆరెంపులలో 135 మంది ఖాతాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు జమ అయింది.

లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు..

ప్రభుత్వం ఒకేసారి నాలుగు పథకాల అమలును ప్రారంభించడం.. అందులో తొలి విడతగా తమకు మంజూరు కావడంపై లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. చాలా రోజుల తర్వాత తమకు పథకాలు అందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటి వరకు దక్కలేదని వారు వెల్లడించారు. ఈనేపథ్యాన పథకాలకు తమను ఎంపిక చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

సంతోషంగా ఉంది..



సెంట్ భూమి లేని మాలాంటోళ్లను ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉంది. వానాకాలంలో వ్యవసాయ కూలీకి, ఎండాకాలంలో ఉపాధి పనికి వెళ్తాం. ఏటా రూ.12 వేలు ఇవ్వనుండడం మాకు బలంగా ఉంటుంది. ఇందులో రూ.6వేలు జమ అయ్యాయి.

–వాంకుడోత్ కౌసల్య, కొత్తతండా, సింగరేణి మండలం

కొండంత అండ..



మూడేళ్లుగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్నా ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వం హామీ మేరకు రేషన్ కార్డు ఇచ్చి మంచి చేసింది. ఏ పథకానికైనా కార్డు అడుగుతుండడంతో ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు కార్డు ఇవ్వడంతో మా బాధలు తప్పినట్లే.

–మూడ్ రాందాస్, కొత్తతండా, సింగరేణి మండలం

కల నెరవేరింది..



పూరి గుడిసెలో ఉంటూ ఏళ్లుగా పక్కా ఇంటి కోసం ఎదురు చూస్తున్నా. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇంటికి దరఖాస్తు చేసుకున్నా రాలేదు. ఈ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి పట్టా కూడా ఇచ్చారు. దీంతో మా కుటుంబం సంతోషంగా ఉంది.

– కనకపుడి లక్ష్మి, గార్లపాడు, బోనకల్ మండలం

త్వరలోనే రాకపోకలు

తుదిదశకు ప్రకాష్‌నగర్ వంతెన మరమ్మతు పనులు



శ్లాబ్ కింద ఆగిన మొద్దును పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: గత ఏడాది సెప్టెంబర్‌లో మున్నేటికి వచ్చిన వరదతో ఖమ్మం ప్రకాశ్‌నగర్‌లోని వంతెన దెబ్బతినగా చేపట్టిన మరమ్మతు పనులు చివరి దశకు చేరాయి. సుమారు రూ.కోటితో చేపట్టిన పనులు ముగియనుండడంతో త్వరలోనే రాకపోకలకు అనుమతి ఇవ్వనున్నారు. మున్నేటి వరదతో బ్రిడ్జి 20పిల్లర్లకు తొమ్మిది పిల్లర్ల వద్ద జాయింట్లు దెబ్బతిన్నాయి. ఒక పిల్లర్ వద్ద వంతెన పలకలు పక్కకు జరిగాయి. దీంతో రాకపోకలు నిలిపేసిన ఆర్‌అండ్‌బీ అధికారులు విశాఖకు చెందిన నిపుణులైన కార్మికులతో మరమ్మతు చేయిస్తున్నారు. అన్ని పిల్లర్లను పరిశీలిస్తూ యథాస్థానానికి చేర్చి లాక్‌లు అమర్చామని ఆర్‌అండ్‌బీ ఈఈ యుగంధర్ తెలిపారు. అలాగే, కర్ర మొద్దులు శ్లాబ్, పిల్లర్ల మధ్య ఇరుక్కోగా శ్లాబ్ పైకి లేపి వాటిని తొలగించాక మళ్లీ యథాస్థానంలో కూర్చోబెట్టామని వెల్లడించారు.

పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.60 కోట్లు

బోనకల్: మండలంలోని చిన్నబీరవల్లిలో పెద్దవాగుపై ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. చిన్నబీరవల్లి–మధిర ప్రధాన రహదారిపై ఈ బ్రిడ్జి ఉండగా వర్షాకాలంలో వాగు ఉధృతితో రాకపోకలు నిలిచిపోతున్నాయి. సమస్యను గ్రామస్తులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.60 కోట్లు మంజూరు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు చంద్ర శ్రీనివాసరావు, పెద్ద కాంతయ్య, ఎం.నర్సయ్య, రాహుల్, టి.కృష్ణ, కోటయ్య, వినయ్ తదితరులు భట్టికి కృతజ్ఞతలు తెలిపారు.

రహదారుల అభివృద్ధికి చొరవ చూపండి

కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి తుమ్మల లేఖ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ప్రధాన రహదారుల అభివృద్ధి, బ్రిడ్జిల నిర్మాణం, విస్తరణ, సెంట్రల్ లైటింగ్, సైడ్ డ్రెయిన్ల నిర్మాణం, నూతన హైవేల నిర్మాణం, పాత బైపాస్ మరమ్మతులను ఇందులో ప్రస్తావించారు. హైవేల నిర్మాణంతో పక్క రాష్ట్రాలకు రవాణా వ్యవస్థ మెరుగుపడడమే కాక దేశంలోనే దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. తద్వారా భక్తులు, పర్యాటకుల రాకపోకలు పెరిగి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే, జాతీయ రహదారుల రీజినల్ ఆఫీసర్‌కు కూడా మంత్రి ఈ లేఖ పంపించారు.

లేఖలో ప్రస్తావించిన ప్రధాన వివరాలు

- ఖమ్మం నాయుడుపేట జంక్షన్ నుండి మున్నేరు బ్రిడ్జి వరకు, ఖమ్మం – అశ్వారావుపేట మార్గంలోని కొణిజర్ల, కల్లూరు, పెనుబల్లి, దమ్మపేటలో నాలుగు లేన్ల రహదారి, సైడ్ డ్రెయినేజీలు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలి.
- వైరా వద్ద కట్టలేరు వాగుపై, సత్తుపల్లి వద్ద తమ్మిలేరు వాగుపై బ్రిడ్జిల స్థానంలో కొత్తవి నిర్మించాలి.
- 365ఏ జాతీయ రహదారిని కోదాడ – ఖమ్మం మధ్య నిర్మించగా గతంలో నిర్మించిన రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణమే కోదాడ వెంకటగిరి నుంచి వెంకటాపురం వరకు రోడ్డును విస్తరించాలి.
- సారపాక – ఏటూరునాగారం వరకు నూతన జాతీయ రహదారిని మంజూరు చేయాలి. తద్వారా అశ్వాపురం, మణుగూరు వద్ద పారిశ్రామిక అభివృద్ధి, భద్రాచలం, మేడారం భక్తులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది.
- జగ్గయ్యపేట–కొత్తగూడెం వరకు బోనకల్, వైరా, తల్లాడ మీదుగా కొత్త హైవే మంజూరు చేయాలి.
- సారపాక నుండి రేచర్ల (ఆంధ్రప్రదేశ్)కు వయా బూర్గంపాడు, వెంకటాపురం, ముల్కలపల్లి, దమ్మపేట, మండలపల్లి, అల్లిపల్లి వరకు రహదారిని హైవేగా ప్రకటించి అభివృద్ధి చేయాలి.

ఇక మున్సిపల్ పాలన



మున్సిపాలిటీగా ఏర్పాటైన ఏదులాపురం

- ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు
- 12 గ్రామపంచాయతీల విలీనంతో ఏర్పాటు
- ప్రత్యేకాధికారి, కమిషనర్‌తో పాటు ఉద్యోగుల నియామకం

కొత్త మున్సిపాలిటీ వివరాలు

విస్తీర్ణం	69.771 చ.కి.మీ.
గృహాలు	18, 967
జనాభా	56,697
ఓటర్లు	44,073
వ్యవసాయ భూమి	10, 805 ఎకరాలు
వ్యవసాయాధారిత కుటుంబాలు	4,849

ఖమ్మంరూరల్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఏదులాపురం మున్సిపాలిటీ కల నెరవేరింది. మండలంలోని ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటుచేయనున్నట్లు గతంలోనే ప్రకటించినా మంగళవారం ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు విడుదలయ్యాయి. గతంలో ఖమ్మం మున్సి పల్ కార్పొరేషన్‌లో విలీనమైన ఐదు పంచాయతీలకు తోడు కొత్తగా మరో ఏడు గ్రామాలను కలుపుకుని మున్సిపాలిటీగా అవతరించింది.

నెలల క్రితమే సర్వే

పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో రూరల్ ఎంపీడీఓ సర్వే చేసి ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రతిపాదిస్తూ నివేదిక సమర్పించారు. దీంతో రూరల్ మండలంలోని ఏదులాపురం, పెదతండా, వెంకటగిరి, గుర్రాలపాడు, గుదిమళ్ల, మద్దులపల్లి, తెల్దారుపల్లి, గొల్లగూడెం, బారుగూడెం, ముత్తగూడెం, పోలేపల్లి పంచాయతీలోని రాజీవ్ గృహకల్ప, పల్లెగూడెం పంచాయతీలోని రెడ్డిపల్లిని కలుపుతూ నూతన మున్సిపాలిటీ ఏర్పాటైంది. ఈమేరకు తమ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని స్థానికులు ఆశిస్తున్నారు.

అధికారుల నియామకం



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న షఫీఉల్లా

జిల్లాలోని సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లో పాలకవర్గాల పదవీకాలం ఇటీవల ముగియడంతో అదనపు కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించారు. ఇక కొత్త మున్సిపాలిటీ ఏదులాపురానికి ప్రత్యేకాధికారిగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో వెల్లడించింది. అలాగే, ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, ఏఈగా యాకూబ్‌అలీ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఆర్.సంతోష్, సీనియర్ అకౌంటెంట్‌గా సతీష్‌కుమార్‌ను నియమించారు. ఈమేరకు ఏదులాపురం జీపీ రికార్డులను మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకోగా కమిషనర్‌గా షఫీఉల్లా బాధ్యతలు స్వీకరించారు. మిగతా గ్రామాల రికార్డులను వచ్చేనెల 6వ తేదీలోగా స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. కాగా, కొత్త మున్సిపల్ కార్యాలయాన్ని ఖరారు చేసేవరకు ప్రస్తుత ఏదులాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

ప్రతీ మొక్కకు జియో ట్యాగింగ్

- ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఆయిల్‌పామ్ తోటలో గట్టుపై కూర్చుని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



భక్త రామదాసు కళాక్షేత్రం ఆధునికీకరణపై సూచనలు చేస్తున్న కలెక్టర్

రఘునాథపాలెం: రైతులకు సరఫరా చేసే ప్రతీ ఆయిల్ పామ్ మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. తద్వారా ఏయే రైతు ఎన్ని మొక్కలు నాటాడో తెలుసుకోవచ్చని, ఆతర్వాత ఎంత మేర దిగుబడి వస్తుందో కూడా తేలుతుందని చెప్పారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో పలువురు రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను మంగళవారం పరిశీలించిన ఆయన గతంలో ఏ పంటలు సాగుచేశారు, ఇప్పుడు ఆయిల్‌పామ్ ఎంత విస్తీర్ణంలో వేశారనే వివరాలతో పాటు నీటి వనరులు, దిగుబడిపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లాభదాయక పంట ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని సూచించారు. అంతర పంటల సాగుకు కూడా అవకాశమున్నందున లాభాలు వస్తాయని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు ఇవ్వడమే కాక డ్రిప్, ఇతరత్రా సబ్సిడీలు కూడా ఇస్తోందని చెప్పారు. కాగా, గ్రామంలోని చెరువుల శిఖం భూములు ఆక్రమణకు గురయ్యాయని రైతులు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే, గ్రామంలోని అర ఎకరం భూమిలో క్లస్టర్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యానవన శాఖ అధికారి జి.నగేష్ తహసీల్దార్ విల్సన్, గోద్రెజ్ ఆగ్రో వెట్ లిమిటెడ్ మేనేజర్ రామకృష్ణ, టీఎస్‌ఎంఐపీ నాగమణి, ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఈఓ శిరణ్మయి, మార్కెట్ డైరెక్టర్ తమ్మిన్ని నాగేశ్వరరావు, రైతులు మెంటం రామారావు, అలస్యం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికే 'మహిళా మార్ట్'

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మహిళా మార్ట్‌లో ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం సీక్వెల్ రోడ్డులో మహిళా మార్ట్ ఏర్పాటుచేయనున్న భవనాన్ని పరిశీలించిన ఆయన నిర్మాణం, పార్కింగ్‌పై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సమన్వయంతో ఉత్పత్తుల అమ్మకానికి మహిళా మార్ట్ ఏర్పాటుచేస్తుండగా ఖమ్మం జిల్లా బ్రాండింగ్ వచ్చేలా లోగో, స్టిక్కర్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. డీఆర్‌డీవో ఆర్.సన్యాసయ్య, అదనపు డీఆర్డీవో నూరుద్దీన్, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ నవీన్‌బాబు, కేఎంసీ ఏసీపీ వసుంధర, డీపీఎం దర్గయ్య పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా భక్త రామదాసు కళాక్షేత్రం

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా కేంద్రంలో సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా ఉన్న భక్తరామదాసు కళాక్షేత్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కళాక్షేత్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన ఆధునికీకరణ పనులపై ఆరా తీయడమే కాక అధికారులకు సూచనలు చేశారు. కళాక్షేత్రంలో ఏసీలు ఏర్పాటుచేయాలని, వేదిక అందరికీ సరిగ్గా కనిపించేలా సీట్లు మార్చాలని, అత్యాధునిక సౌండ్ సిస్టం ఏర్పాటుచేయాలని సూచించారు. పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి, డీఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హుండాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారు విడుదల



కారును విడుదల చేస్తున్న అధికారులు, షోరూం ప్రతినిధులు

ఖమ్మంఅర్బన్: హుండాయ్ కంపెనీ నూతనంగా రూపొందించిన క్రెటా ఎలక్ట్రిక్ కారును మంగళవారం ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. స్థానిక శ్రీశ్రీ సర్కిల్ సమీపంలోని భారత్ హుండాయ్ షోరూంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ లింగస్వామి, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంత్ రెడ్డి, భారత్ గ్రూప్ చైర్మన్ కేస సుభాష్ చంద్ర బోస్, సీఈఓ శయన్ కృష్ణ కారు విడుదల చేయగా సీఈఓ మాట్లాడారు.

తపాలా శాఖలో బీమా

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ ద్వారా అమలుచేసే బీమా పథకాలకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి సూచించారు. ఖమ్మంలోని కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 1న తపాలా బీమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వయస్సుల వారీగా గ్రూపు, వ్యక్తిగత బీమా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. పోస్టల్ పేమెంట్ బ్యాంకు ద్వారా రూ.549 ప్రీమియంతో రూ.10 లక్షల ప్రమాద బీమా, రూ.749తో రూ.15 లక్షల పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. పాలసీల కోసం సమీపంలోని తపాలా కార్యాలయాల్లో సంప్రదించొచ్చని తెలిపారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ డైరెక్టర్‌గా మేఘశ్యామ్



నియామకపత్రం అందుకుంటున్న మేఘశ్యామ్

మధిర: మధిరకు చెందిన మేఘశ్యామ్‌ను అమెరికాలోని టెక్సాస్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయనకు మంగళవారం సంస్థ చైర్మన్ చింతపల్లి వెంకటాచారి ఆధ్వర్యాన అక్కడ ప్రముఖ సంగీత దర్శకులు మణిశర్మ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా మేఘశ్యామ్ మాట్లాడుతూ టెక్సాస్‌లో ప్రతిభావంతులైన తెలుగు వారిని గుర్తించేందుకు ఈ రికార్డులు ఉపకరిస్తాయని తెలిపారు.

'సిరాడ్' మొక్కలకే ప్రూనింగ్

సత్తుపల్లి: మండలంలోని రేగళ్లపాడు నర్సరీకి కోస్టారికా దేశం నుంచి దిగుమతి చేసుకున్న తంబా రకం ఆయిల్‌పామ్ మొక్కలను ఆఫ్‌టైప్‌గా గుర్తించామని టీజీ ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగబాబు తెలిపారు. దీంతో ఈ మొక్కలకు ప్రూనింగ్ చేయడం లేదని పేర్కొన్నారు. 'సాక్షి'లో మంగళవారం 'ఆఫ్‌టైప్ మొక్కలకూ ప్రూనింగ్' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేవలం సిరాడ్ రకం మొక్కలకు మాత్రమే ప్రూనింగ్ చేస్తున్నామని, మొక్కల ప్రూనింగ్ నిరంతరం జరుగుతుందని తెలిపారు. రైతులకు నాణ్యమైన మొక్కలనే ఆయిల్‌ఫెడ్ అందిస్తుందని, ఈక్రమాన ప్రతీమొక్కపై పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు. అంతేకాక ప్రతీనెల నర్సరీ సమాచారాన్ని కేంద్ర కార్యాలయానికి సమర్పిస్తున్నామని ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వకు గండి

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ పరిధిలో ఎస్సారెస్పీ కాల్వ కట్టపై మంగళవారం గండి పడింది. దీంతో నీళ్లు బయటకు రాగా పంటలు దెబ్బతిన్నాయి. చేగొమ్మ–కొండాపురం మధ్య పడిన గండితో సుమారు పదెరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. కాల్వ కట్టలపై మట్టిని రైతులు తరలించడంతోనే బలహీనపడి గండి పడినట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు కట్టకు మరమ్మతులు చేపడుతామని వెల్లడించారు.

చెరువులో ఆక్రమణల తొలగింపు

కొణిజర్ల: మండలంలోని లాలాపురం తుమ్మల చెరువులో అక్రమంగా నిర్మించిన చేపల చెరువు కట్టలను సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు ఐబీ అధికారులు తొలగించారు. గ్రామానికి చెందిన కోటేశ్వరరావు తనకు రెండెకరాల పట్టా ఉందని చేపల చెరువు నిర్మించగా స్థానికుల ఫిర్యాదుతో విచారణ చేపట్టారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోనే చేపల చెరువు నిర్మించినట్లు తేలగా సోమవారం జేసీబీతో తొలగించేందుకు వెళ్తే కోటేశ్వరరావు దంపతులు అడ్డుకున్నారు. వైరా సీఐ సాగర్, కొణిజర్ల ఎస్‌ఐ సూరజ్ బందోబస్తు ఏర్పాటుచేయగా చెరువు కట్టలు తొలగించారు. ఏఈ నాగేంద్రకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

రఘునాథపాలెం: తప్పుడు పత్రాలతో ప్లాట్ అమ్మిన ముగ్గురిపై రఘునాథపాలెం పోలీసులు మంగళవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. రఘునాథపాలెంలో 200 గజాల ప్లాట్‌ను 2021లో కె.రామారావుకు టి.మురళి, వి శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ రూ.18 లక్షలకు అమ్మి రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే, ఆ ప్లాట్‌ను మరొకరటికి అమ్మినట్లు తెలియడంతో తాను మోసపోయానని గుర్తించిన రామారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

రైటర్లు చెబితే రైట్.. రైట్!

సత్తుపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లదే హవా

- రుణాలు వస్తాయంటూ నమ్మబలికి రిజిస్ట్రేషన్లు
- ఉద్యోగులు వింటే సరి.. లేకపోతే దబాయించైనా పనులు



సత్తుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

సత్తుపల్లి: సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ల లావాదేవీలు ఒక్కటొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అధికార పార్టీ అండ ఉందని చెబుతూ ఒకరిద్దరు డాక్యుమెంట్ రైటర్లు అధికారులకు డబ్బుల ఎరచూపి బుజ్జగించి.. వినకపోతే బెదిరించైనా దందాకు తెరలేపినట్లు ప్రచారం జరుగుతోంది. భూముల రిజిస్ట్రేషన్లు మొదలు వివాహాల రిజిస్ట్రేషన్ల వరకు అందినకాడికి దిగమింగుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రతీ పనికి రేటు నిర్ణయించి రిజిస్ట్రేషన్ల కోసం వస్తున్న వారిని పట్టి పీడిస్తున్నారని సమాచారం. కాగా, ఇటీవల వసూళ్ల వాటాల పంపకంలో తేడాలు రావడంతో కార్యాలయ సిబ్బంది సైతం సెలవుపై వెళ్లిన అధికారిపై వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది.

రూ.లక్షకు తగ్గకుండా...

సత్తుపల్లి డివిజన్‌లో పలువురికి బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామంటూ కొందరు ప్రలోభపెడుతున్నారు. గ్రామాలు, కాలనీల్లో కలియదిరుగుతూ సరైన పత్రాలు లేని, అసైన్డ్ భూముల్లో కట్టుకున్న ఇళ్లకు సైతం ఇంటి నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచిస్తున్నట్లు తెలిసింది. ఆపై సులువుగా బ్యాంక్ రుణం వస్తుందని ఆశ చూపి రూ.లక్షకు తగ్గకుండా లాగుతున్నట్లు సమాచారం. అంతేకాక ప్రైవేట్ బ్యాంకుల్లో అక్రమ రిజిస్ట్రేషన్లతో రుణాలు ఇప్పించడం.. ఆపై విషయం బయటపడి బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుండడంతో రుణాలు తీసుకున్న వారు లబోదిబోమంటున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చుని...

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి మండలాల్లో ఎలాంటి స్థలమైనా రిజిస్ట్రేషన్ చేయడానికి ఒకరిద్దరు డాక్యుమెంట్ రైటర్లు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలోనే సబ్ రిజిస్ట్రార్‌ను మచ్చిక చేసుకుని ఆయనకు ఇచ్చే నగదుకు మూడు రెట్లు అదనంగా యజమానుల వద్ద వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక్కో డాక్యుమెంట్ రైటర్ రోజుకు నాలుగైదు రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారని తెలిసింది. ఓ డాక్యుమెంట్ రైటరైతే ఏకంగా సెలవులో వెళ్లిన సబ్ రిజిస్ట్రార్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని ఆసరాగా చేసుకుని అధికారి కుర్చీలో కూర్చునే వారని సిబ్బంది ద్వారా తెలిసింది. గతంలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్‌పైనా అక్రమ రిజిస్ట్రేషన్ కోసం ఒత్తిడి తెస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్న హెచ్చరికతో వెనక్కి తగ్గినట్లు సమాచారం.

విచారణ జరిపిస్తే...

సత్తుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమ లావాదేవీలపై ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తే మరిన్ని విషయాలు బయటకు వస్తాయని పలువురు చెబుతున్నారు. రికార్డులు లేకుండా, లింక్ డాక్యుమెంట్లు లేకుండా వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేశారని, కనీసం తహసీల్దార్ అప్రూవల్ లేని అసైన్డ్ భూములకు సైతం రిజిస్ట్రేషన్ చేయించారనే చర్చ జరుగుతోంది. ఈనేపథ్యంలోనే అధికార పార్టీ పేరు చెప్పి ఎవరైనా అక్రమాలకు పాల్పడినా, అధికారులను బెదిరించినా నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు కోరారు.

కట్టడి చేస్తున్నాం..

డాక్యుమెంట్ రైటర్లను కార్యాలయంలోకి రాకుండా కట్టడి చేస్తున్నాం. ఎలాంటి అక్రమాలు జరగకుండా ప్రతీ రిజిస్ట్రేషన్ సమయాన అన్ని పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ఏమైనా అనుమానాలు వస్తే రెవెన్యూ అధికారులతో ఆరా తీస్తున్నారు. గతంలో ఇక్కడ జరిగిన లావాదేవీలపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

– శ్రీనివాసరావు, సబ్‌రిజిస్ట్రార్ సత్తుపల్లి

రైతులకు నాబార్డు చేయూత

- సీజీఎం ఉదయ్‌భాస్కర్
- పాలేరులో 'బయోఫ్లాక్ ఆక్వా ఫార్మింగ్' ప్రారంభం



పరిశోధనా కేంద్రంలో చేపల విత్తనాలను పరిశీలిస్తున్న నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్, అధికారులు

కూసుమంచి: రైతులకు ఆధునిక పరిజ్ఞానాన్ని సమకూర్చే ప్రభుత్వ శాఖలు, సంస్థలకు తగిన సహకారాన్ని అందించడంలో నాబార్డు ముందుంటుందని చీఫ్ జనరల్ మేనేజర్(తెలంగాణ) బి.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. మండలంలోని పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో రూ.20.30 లక్షల నాబార్డు నిధులతో ఏర్పాటుచేసిన బయో ఫ్లాక్ ఆక్వా ఫార్మింగ్ యూనిట్‌ను ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు, కులవృత్తిదారులకు నాబార్డు పలు పథకాల ద్వారా సాయం అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా 'మా తోట' పథకం ద్వారా 40తోటల్లో పండ్ల పెంపకం చేపడుతున్నామని, 370 రైతు ఉత్పత్తి కేంద్రాల ద్వారా అన్నదాతలకు ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పాలేరు పరిశోధనా కేంద్రంలో రైతులకు ఆధునిక విధానంలో చేపల పెంపకంపై అవగాహన కల్పించేలా బయో ఫ్లాక్ యూనిట్ ఏర్పాటుక సహకారం అందించామని వెల్లడించారు. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(ఫిషరీస్) డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ 175లక్షల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తి అవుతుండగా, 2026 నాటికి 200 లక్షల టన్నులకు చేర్చేలా కృషి జరుగుతోందన్నారు. చేపల ద్వారా తక్కువ ఖర్చుతో పోషకారం అందుతున్నందున ప్రజల డిమాండ్ మేరకు పెంపకం చేపట్టాలని, ఇందుకు అనువైన వనరులు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మత్స్య విస్తరణ డైరెక్టర్ కిషన్‌కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కే.వెంకటేశ్వర్లు, నాబార్డు మేనేజర్ శాశ్వతి, డీఎం సుజిత్‌కుమార్, యూనియన్ బ్యాంకు ఆర్‌ఎం సూర్యనారాయణ, వివిధ బ్యాంకుల మేనేజర్లు రమేష్‌కుమార్, రవి, ఉపేందర్, పాలేరు పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య రైతులకు శిక్షణ ప్రారంభం

శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఏర్పాటైన బయో ఫ్లాక్ ఆక్వా ఫామింగ్ యూనిట్ ద్వారా మత్స్య రైతులకు ఇచ్చే మూడు రోజుల శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. తక్కువ స్థలంలో ట్యాంకుల ద్వారా ఎక్కువ చేపలు పెంచడమే బయోఫ్లాగ్ విధానమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందులో మేత ఖర్చు తగ్గడమే కాక లాభాలు పెరుగుతాయని వెల్లడించారు. శిక్షణలో ఖమ్మం, వనపర్తి, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల మత్స్య రైతులు పాల్గొన్నారు.

కూలీల ట్రాక్టర్ బోల్తా, ఆరుగురికి గాయాలు

కూసుమంచి: కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ మండలంలోని నర్సింహులగూడెం సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం బోల్తా పడగా ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని జుజుల్‌రావుపేటకు చెందిన పలువురు కూలీలు నర్సింహులగూడెంలో మిర్చి కోసేందుకు ట్రాక్టర్‌లో బయలుదేరారు. సబ్‌స్టేషన్ వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న వరద కాల్వలోకి దూసుకెళ్లగా ట్రక్కు పల్టీ కొట్టింది. అయితే, ట్రక్కు పూర్తిగా బోల్తా పడకపోవటంతో పెను ప్రమాదం తప్పగా గాయపడిన వారిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

టీ.టీ.లో నంబర్‌వన్ మనోడే

జాతీయస్థాయి అండర్–15 ర్యాంకింగ్స్‌లో జ్వలిత్



జ్వలిత్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంకు చెందిన పరిటాల జ్వలిత్ అండర్–15 విభాగం టేబుల్ టెన్నిస్ జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జాతీయ స్థాయి పోటీల నేపథ్యాన జాబితా ప్రకటించగా ఖమ్మంకు చెందిన చలపతిరావు – లక్ష్మి కుమారుడైన జ్వలిత్‌కు స్థానం దక్కింది. పలుమార్లు జాతీయ స్థాయిలో అండర్–15 పోటీల్లో సత్తా చాటిన ఆయన మొదటి ర్యాంకులో నిలవడం విశేషం. ఈసందర్భంగా డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, కార్యదర్శి వీవీఎస్.సాంబమూర్తితో పాటు కూరపాటి ప్రదీప్, పుట్టా శంకరయ్య, కె.క్రిస్టోఫర్‌బాబు తదితరులు జ్వలిత్‌ను అభినందించారు.

జాతీయస్థాయి టీ.టీ. టోర్నీకి జిల్లా క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఈనెల 30నుంచి జరగనున్న జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో జిల్లాక్రీడాకారులు 12మందికి స్థానం దక్కింది. జట్టుకు ఎంపికైన వారిలో పి.జ్వలిత్, పిట్టల మోహిత్‌కృష్ణ, షేక్ ఫజల్, జి.చార్విక్, మహ్మద్ అనస్, ఈ.తరుణ్, ఈ.హరి, హితేష్, శ్రీయన్, ఉజ్వల్, పి.వన్సిక, సిరి, సాయిశివాని ఉన్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టీ.టీ. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, వీవీఎస్.సాంబమూర్తి, గౌరవ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రావుతో పాటు డాక్టర్ కూరపాటి ప్రదీప్, డాక్టర్ ప్రవీణ్, చలపతిరావు తదితరులు అభినందించారు.



కరీంనగర్‌లో మంగళవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోలీసుల స్పోర్ట్స్ మీట్‌లో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న భద్రాద్రి జోన్ జట్టు.

యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రతుల దహనం

ఖమ్మంసహకారనగర్: కేంద్ర ఆర్థిక శాఖ యూనిఫైడ్ పెన్షన్ విధానం(యూపీఎస్)పై నోటిఫికేషన్‌ను జారీ చేయడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రతులను సోమవారం దహనం చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన నిరసన తెలపగా టీఎస్ సీపీఎస్ ఈయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి పలుచోట్ల పాల్గొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పోరాడుతుండగా ఇప్పుడు కేంద్రం యూపీఎస్ విధానాన్ని తీసుకురావడం గర్హనీయమన్నారు. ఈకార్యక్రమాల్లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రకంటి శశిధర్, చర్ల శ్రీనివాసరావుతో పాటు జిలానీ, కె.సంపత్, ఐ.భాను తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మం డైట్‌లో భోజన విరామ సమయాన జరిగిన నిరసనలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎర్రమళ్ల శ్రీనివాసరావుతో పాటు ఎల్.సుధీర్, గోధుమల నవీన్, తిప్పిరెడ్డి రామకృష్ణారెడ్డి, కె.రాజారావు, ఎల్.సందీప్, అలివేలు, లక్ష్మణ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



యూపీఎస్ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేస్తున్న ఉద్యోగులు

చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన జారీ చేసిన చెక్కు చెల్లకపోవడంతో చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కె.దీప మంగళవారం తీర్పు చెప్పారు. ఖమ్మంకు చెందిన దొడ్డ రమేష్ వద్ద తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెంకు చెందిన నాగండ్ల శ్రీనివాసరావు 2016 జనవరిలో రూ.6లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ అప్పుచెల్లించేందుకు 2017 డిసెంబర్‌లో ఇచ్చిన చెక్కును బ్యాంకులో జమ చేస్తే సరిపడా నగదు లేక నిరాదరణకు గురైంది. దీంతో రమేష్ న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఈ కేసును విచారణ అనంతరం శ్రీనివాసరావుకు ఆరు నెలల జైలుశిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.9లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

- చెల్లని చెక్కు జారీ చేసిన ఘటనలో ఏపీలోని కృష్ణా జిల్లా నందిగామ మండలం లింగాలపాడుకు చెందిన అట్లూరి సుబ్రహ్మణ్యేశ్వరరావుకు కూడా జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి దీప తీర్పుచెప్పారు. ఖమ్మం సహకారనగర్కు చెందిన చింతలపూడి శరత్బాబు ఆయన 2018 సెప్టెంబర్‌లో రూ.7లక్షల అప్పు తీసుకోగా 2019 నవంబర్‌లో రూ.6లక్షలకు చెక్కు ఇచ్చాడు. అయితే, చెక్కు చెల్లకపోవడంతో కేసు దాఖలు చేయగా విచారణ అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరరావుకు ఆరు నెలల జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.9లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించారు.

వసతిగృహం నుండి వెళ్లిపోయిన విద్యార్థులు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం మహాత్మా జ్యోతి పూలే వసతిగృహం నుండి మంగళవారం రాత్రి ఇద్దరు విద్యార్థులు ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోగా, కాసేపట్లోనే ఉపాధ్యాయులు వారిని గుర్తించి తీసుకొచ్చారు. రాత్రి భోజన సమయాన ఇద్దరు వసతిగృహం గోడ దూకి బయటకు వెళ్లిపోయారు. అయితే, వారిద్దరు కూసుమంచి వైపు నడిచి వెళ్తుండగా ఓ వ్యక్తి ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ ఫొటోలను చూసిన తల్లిదండ్రులు, బంధువులు వెళ్లి వారిద్దరిని పాలేరు ట్యాంకుబండ్‌పై గుర్తించారు. ఇంతలోనే వెతుకుతూ వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థులిద్దరిని తీసుకెళ్లారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ మల్లయ్యను వివరణ కోరగా విద్యార్థులు ఇంటికి వెళ్లాలనే బయటకు వచ్చారని, తిరిగి తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. మరోమారు ఇలాంటి ఘటనలకు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

వైరా: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నా, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్ హెచ్చరించారు. వైరా మున్సిపాలిటీ 5వ వార్డు 98వ సర్వే నంబర్‌లో బంచరాయి కింద 17.36 ఎకరాల భూమి ఉండగా, 30ఏళ్ల నాలుగెకరాలు కొందరు రైతుల పేరుతో రిజిస్ట్రేషన్ అయింది. మిగిలిన 13.36 ఎకరాల భూమి చేతులు మారుతోందని, ఇందులో 273 గజాల భూమిని ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించారు. అలాగే, మరో 723 గజాల రిజిస్ట్రేషన్‌కు కొందరు అధికారులే సహకరించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యాన భూమిని మంగళవారం పరిశీలించిన తహసీల్దార్ మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ రోడ్డులో ఉన్న 98 సర్వే నంబర్‌లోని భూమిని వారంలోగా సర్వే చేయిస్తామని తెలిపారు. ఆపై హద్దులు నిర్ధారించి అక్రమ రిజిస్ట్రేషన్లను కట్టడి చేస్తామని, ఈ విషయమై రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనూ లేఖ ఇచ్చినట్లు వెల్లడించారు.

ప్రభుత్వాస్పత్రిలో ఎన్‌హెచ్‌ఎం బృందం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని ఏరియా ప్రభుత్వాస్పత్రిని జాతీయ ఆరోగ్య మిషన్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన కేంద్ర బృందం మంగళవారం సందర్శించింది. రెండేళ్లుగా ప్రభుత్వాస్పత్రులకు ఎన్‌హెచ్‌ఎం నిధులు నిలిచిపోయాయి. అయినా ఆస్పత్రుల నిర్వహణను పరిశీలించేందుకు వచ్చిన మురిగేషన్, సెంథిల్‌కుమార్‌తో కూడిన బృందం అన్ని విభాగాల్లో ఉద్యోగుల పనితీరు, రికార్డులను తనిఖీ చేసింది. కాగా, కార్యక్రమాల నిర్వహణ, నాణ్యత ఆధారంగా నిధులు వస్తాయని వారు తెలిపారు. ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ డి.రామారావు, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రామ్ అధికారి మేకల దుర్గ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ సురేష్‌నారాయణ్, ఉద్యోగులు రాధాకృష్ణకుమారి, హైమావతి పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కమిటీ ఎన్నిక



అసోసియేషన్ బాధ్యులతో అధ్యక్షుడు వెంకట్ (మధ్యలో)

ఖమ్మంగాంధీచౌక్: ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు మంగళవారం ఖమ్మంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో మారగాని వెంకట్ ప్యానెల్ ప్రత్యర్థి ప్యానెల్‌పై విజయం సాధించింది. అధ్యక్షుడిగా మారగాని వెంకట్, ప్రధాన కార్యదర్శిగా పిన్నం కనకారావు, కోశాధికారిగా నీరుడు తిరుపతిరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ రంగంపై ఆధారపడిన వారి సమస్యల పరిష్కారంతో పాటు అసోసియేషన్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

కొణిజర్ల: మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చని జిల్లా వ్యవసాయాధికారి ధనసిరి పుల్లయ్య తెలిపారు. మండలంలోని తనికెళ్లలో మంగళవారం ఆయన మొక్కజొన్న పంటను పరిశీలించి మాట్లాడారు. కత్తెర పురుగు ఆశిస్తున్నందున ఎకరానికి కనీసం ఐదు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పొలంలో కలుపు లేకుండా చూసుకోవాలని, పురుగు ఉధృతి పెరిగితేనే మందులు పిచికారీ చేయాలని సూచించారు. తొలుత రైతువేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు డీఏఓ హాజరయ్యారు. వైరా ఏడీఏ టి.కరుణశ్రీ, ఏఓలు బాలాజీ, పవన్ అనిల్, రైతులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రం వద్ద ఆందోళన



చంటిపిల్లలతో వేచి ఉన్న మహిళలు

ఖమ్మంమయూరిసెంటర్: దరఖాస్తుదారులతో యాజమాన్యం, సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారంటూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీ సేవ కేంద్రం వద్ద పలువురు మంగళవారం ఆందోళనకు దిగారు. ఆధార్, బర్త్ సర్టిఫికెట్ల దరఖాస్తులు ఆన్‌లైన్ చేసేందుకు రోజుల తరబడి తిప్పించుకుంటున్నారని వాపోయారు. పిల్లల ఆధార్ నమోదు కోసం సోమవారం ఉదయం రాగా 9గంటల్లోగా రావాలని చెప్పడంతో వెనుదిరిగామని చెప్పారు. తిరిగి మంగళవారం తెల్లవారుజామున 5గంటలకే వచ్చినా దరఖాస్తులు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్న సిబ్బంది, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

యువకుడి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం రంగనాయకుల గుట్ట ప్రాంతానికి చెందిన కుంచెపు వెంకటేష్(24) ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీ పనులు చేసే ఆయన భార్య శిరీష, తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. అయితే, ఇటీవల మద్యానికి బానిసై పనికి వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేష్ సోమవారం అర్ధరాత్రి దాటాక అంతా నిద్రించాక ఉరి వేసుకోవడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ పోలీసులు తెలిపారు.